## సింగిల్ పేజీ కథ

# అనుభవం

**పెళ్లిచూపుల కార్యక్రమం జరుగుతోంది. పెళ్లికూతురు సీత, పెళ్లికొడుకు రాంబాబు ఏకాంతంగా మాట్లాడుకుంటున్నారు.**

**"మీరు నిరుద్యోగి కదా, మరి పెళ్లికెందుకు సిద్ధపడ్డట్టు"**

**"వయసు మీద పడుతుంటే ఏం చేయను. ఏ వయసు ముచ్చట ఆ వయసులో తీర్చుకోవాలంటారు. ఇక్కడ ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరికి చావలేదు. అందుకే పెళ్లికి సిద్ధపడ్డాను"**

''పెళ్లయిం తర్వాత ఏం చేయాలనుకుంటున్నారు?''

''నా భార్య ఎంత త్వరగా సహకరిస్తే, అంత త్వరగా అమ్మని చేసిపెడతా. వయసు మీరాక పిల్లల్ని కనటం అంత మంచిది కాదటగా.''

''నేనడిగేది సంపాదన గురించి''

''ఓస్..అదా. ఎం.ఎ., ఎం.ఫిల్. చేసినవాడిని. ఇక్కడ కాకపోతే ఎక్కడైనా ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోతుందా? ఎవరి కాళ్లో పట్టుకుని ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోతా''

★ ★ ★

సీతా రాంబాబుల పెళ్లయింది. సీత ఉద్యోగం చేస్తున్న హైదరాబాద్‌లోనే కొత్త కాపురం. క్యాలెండర్‌లో రెండు పేజీలు వెనక్కి వెళ్లాయి.

''హలో సార్, తమరేం వెలగబెడుతున్నారో తెలుసుకోవచ్చా''

''వైనాట్ మేడమ్, ఖానా, పీనా, సోనా''

''నేనడిగేది ఉద్యోగ ప్రయత్నాల గురించి''

''ఎక్కడికెళ్లినా నీ బోడి ఎం.ఏ, నీ బోడి ఎం.ఫిల్లాను, ఎవడిక్కావాలయ్యా. టెక్నికల్ ఏదైనా ఉంటే చెప్పు- అంటున్నారు మేడమ్''

''టెక్నికల్లా? ఈ వయసులో మళ్లీ చదువు మొదలెడతారా?''

''ఊహు, నా పీజీతోనే వాళ్ల పిలకలు జాడించి ఉద్యోగం సంపాదిస్తా'' మరో నెల గడిచింది.

''ఎవరి పిలకైనా జాడించారా బాస్?''

''అనుకొన్నా గాని, కొత్తగా అనుభవం కావాలంటున్నారు అంట్ల వెధవలు''

''అనుభవమా? ఉన్నపళంగా అదెలా సంపాదిస్తారు?''



''చూస్తుండు, ఒకటి రెండు నెలల్లో నా తడాఖా చూపిస్తాను''

★ ★ ★

''డియర్ హబ్బీ, మీకో గుడ్‌న్యూస్. తమ తడాఖా చూపించి, ఉద్యోగం మాటటుంచి నన్ను అమ్మని చేసిపెట్టారు''

తన ప్రతాపానికి ఆరడుగులు పైకెగిరి పుచ్చకాయలా క్రిందపడ్డాడు అమితానందానికి చిహ్నంగా.

★ ★ ★

''సార్, క్రింద కూర్చొని కూరలు తరగలేకపోతున్నానండి''

''డోంట్ వర్రీ యార్, నేనున్నానుగా. అదిలా పడేయ్''

''ఏవండీ నీరసంగా ఉంటోంది. నిలబడ్డానికి కూడా ఓపిక లేదు. కళ్లు తిరుగుతున్నాయ్.''

''రెస్టు తీసుకో డియర్. నువ్వలా బెడ్‌మీంచే డైరక్షన్ ఇస్తూండు. నేనిలా కథ నడిపిస్తా''

అయ్యవారికి వంటా వార్పుల్లో ప్రవేశం.

''ఏవండీ, వంటకీ ఇంటిపనికీ మా అమ్మనో, మీ అమ్మనో రప్పిద్దామండీ''

''వద్దండీ. అల్లుడి నిరుద్యోగం, అత్తమ్మల పెత్తనం ఒకే గూటిలో ఇమడవండి.''

క్యాలెండర్‌లో మరో రెండు పేజీలు వెనక్కి వాలాయి.

''ఏవండీ వంగలేకపోతున్నా''

''తాళికట్టిన మొగుణ్ని నేనుండగా, నిన్నెవరు వంగమన్నారోయ్. ఇలా వచ్చేయ్'' చాకలి ఉతుకులో కూడా రంగ ప్రవేశం.

★ ★ ★

సీత పుట్టింటికి వెళ్లి కేర్ కేర్‌మంటున్న పిల్లాడితో తిరిగొచ్చింది. ఈలోగా రాంబాబు స్వీపరు పోస్టు నుండి సూపరిన్టెంటు పోస్టువరకు అన్ని రకాల ఉద్యోగాలకు విశ్వప్రయత్నం చేసి విసిగి వేసారేడు. ఉద్యోగాలు అతడికి అందని ద్రాక్షపళ్లలా అనిపించాయి. ఇక ఇంట్లో పాకశాస్త్రంలో నలభీములోను, ఇంటిపనుల్లో ఆడపడుచుల్తోను పోటీపడి గొప్ప అనుభవం సంపాదించాడు.

''హాయ్ హాండ్‌సమ్, ఇన్నాళ్లూ ఖాళీయేగా. ఎందులోనైనా దూరి అనుభవం సంపాదించారా?''

''హబ్బో, బోలెడు అనుభవం సంపాదించా. తండ్రిగా ప్రమోటయ్యాక ఇంతటి అనుభవాన్ని గాలికొదిలి వేరే చోట తలవమ్ముకోవడం ఎందుకు. కొన్నాళ్లపాటు ఈ ఉద్యోగాన్నే కంటిన్యూ చేస్తా'' అంటూ చేతిలో పిల్లాడిని సీత చేతిలో పెట్టి, కుక్కర్ పడేయడానికి కిచెన్‌లోకి నడిచాడు పాపం రాంబాబు.

**-సాయిప్రియ. సిహెచ్.**